సాక్షి
పెద్దపల్లి
గురువారం । 4 । జనవరి । 2024



అక్షింతలు పంపిణీ

ఎలిగేడు(పెద్దపల్లి): అయోధ్యలోని శ్రీరామ చంద్రమూర్తిస్వామి అక్షింతలను బుధవారం ర్యాకల్‌దేవుపల్లిలో పంపిణీ చేశారు. సుల్తాన్‌పూర్‌లో అక్షింతలు ఊరేగించారు.



సింగరేణి సీఎండీతో భేటీ

జ్యోతినగర్: సింగరేణి సీఎండీ బలరాంను ఎన్టీపీసీ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా సోమ్లా నాయక్ హైదరాబాద్‌లో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.4/16.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం మంచుకురిసే అవకాశం ఉంది. చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అర్జీలను ఆన్‌లైన్ చేయాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): ప్రజాపాలన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపుకలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆదేశించారు. ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేట, జూలపల్లి మండలం కోనరావుపేటలో బుధవారం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ కొండయ్య ఉన్నారు.

గ్యారెంటీలు అమలు చేస్తాం



అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం శివ పల్లిలో బుధవారం ఆయన ప్రజాపాలన గ్రామసభ ద్వారా గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. సర్పంచ్ దుగ్యాల శ్వేత, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సీపీని కలిసిన జీఎం



పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. జీఎం వెంట సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.


సంస్కృతికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం హరిహర దేవాలయ ఆవరణలోని అయ్యప్ప స్వామి ఆలయ మండప నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. అర్చకుడు వామనశర్మ పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈడీ మాట్లాడుతూ, ఉద్యోగుల్లో ఆధ్యాత్మికత, ప్రశాంతత పెంపొందించేందుకు ఎన్టీపీసీ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అన్ని రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తుందని తెలిపారు. కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి బండారి కనకయ్య, నాయకులు కొలిపాక మల్లయ్య, ఆరెల్లి సత్యనారాయణగౌడ్, సంపత్‌రావు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వంటగ్యాస్.. ట్రయల్ రన్ సక్సెస్



సీఎన్‌జీ మీటర్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతమైంది. రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో తొలిదశ ఇంటింటా వంట గ్యాస్ (సీఎన్‌జీ) సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం గ్యాస్ సరఫరాపై ట్రయల్ రన్ టెక్నికల్ ప్రాసెస్ విజయవంతమైంది. ఇక ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఐవోసీఎల్ అధికారులు బుధవారం తెలిపారు.

మా నిధులు.. మాకు దక్కేనా?

- గత ప్రభుత్వంలో పొరుగు జిల్లాలకు తరలిన డీఎంఎఫ్‌టీ నిధులు
- స్థానికంగా ఖర్చు చేయాల్సిన వాటికన్నా తరలించినవే అధికం
- నిబంధనల మేరకు ప్రభావిత ప్రాంతాల్లోనే నిధులు వెచ్చించాలి
- కాంగ్రెస్ సర్కారులోనైనా తరలింపునకు అడ్డుకట్ట పడేనా!



సాక్షి, పెద్దపల్లి: నల్ల బంగారంగా ప్రసిద్ధిచెందిన ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులతోపాటు గ్రానైట్, ఇసుక తవ్వకాల ద్వారా జిల్లా మైనింగ్ శాఖకు ఏటా రూ.వందల కోట్లపైనే ఆదాయం సమకూరుతోంది. జిల్లా అపార ఖనిజ వనరులకు నెలవు. కానీ, జిల్లా ప్రజలకు న్యాయంగా దక్కాల్సిన సొమ్ము ఇతర జిల్లాలకు తరలిపోతోంది. అంతేకాదు.. సింగరేణి సంస్థ నుంచి రావాల్సి రూ.500కోట్ల బకాయిలు ఇంకా విడుదల కావడంలేదు. తద్వారా ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. పేరు పెద్దపల్లిది.. ఫలితం పలుకుబడి నేతలదిగా మారింది. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సింగరేణి నుంచి బకాయిలు వసూలై, ఇక్కడి నిధులు ఇక్కడే ఖర్చు చేయాలని కార్మికులు, జిల్లావాసులు కోరుకుంటున్నారు. మరోవైపు.. డీఎంఎఫ్‌టీ నిధులు, ఖర్చులపై 'కాగ్' ఆరా తీస్తుండడంతో జిల్లాకు చెందాల్సిన నిధులు ఎక్కడెక్కడ, ఎంతెంత ఖర్చు చేశారనే వివరాలు సమర్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

60:40 చొప్పున ఖర్చు చేయాలి

- బొగ్గు, ఖనిజ, ఇసుక తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయంలో 30శాతం సీనరేజీ సొమ్ము జిల్లా మైనింగ్ అడిషనల్ డైరెక్టర్ ద్వారా డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) జిల్లా కమిటీకి జమ అవుతుంది. ఖనిజాలను తవ్వి, తరలించడం ద్వారా దెబ్బతింటున్న ప్రాంతాలు, ప్రభావితం కాని ప్రాంతాల్లో ఆ సొమ్ము 60:40 చొప్పున ఖర్చు చేయాలి.

ఇతర ప్రాంతాలకు రూ.507.71కోట్లు

- సింగరేణి సంస్థ.. డీఎంఎఫ్‌టీ ఖాతాకు నేరుగా జమచేయాల్సిన నిధులు.. జిల్లా కమిటీకి తెలియకుండానే ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. ఇలా ఇప్పటివరకు సుమారు రూ.507.71కోట్లు తరలిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఎక్కడికి ఎంతెంత అంటే..

- కోవిడ్ నివారణ కోసం నేరుగా రూ.121.88 కోట్లు తరలిపోయాయి.
- ఇందులో జగిత్యాలకు 84.23కోట్లు, సిరిసిల్లకు రూ.11.8కోట్లు, కరీంనగర్‌కు రూ.6.30కోట్లు, జనగామకు రూ.2.05కోట్లు, ములుగుకు రూ.2.10కోట్లు తరలించారు.
- ఇవి డీఎంఎఫ్‌టీ కమిటీ అనుమతి లేకుండానే తరలిపోయాయి.
- డీఎంఎఫ్‌టీ కమిటీ అనుమతితో.. జగిత్యాలకు 23.01కోట్లు, సిరిసిల్లకు రూ.31.92కోట్లు, భూపాలపల్లికి రూ.18కోట్లు, మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు రూ.5.23కోట్లు, సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.279.43కోట్లు తరలిపోయాయి.

డీఎంఎఫ్‌టీ ఇలా..(రూ.కోట్లలో)	
ఇప్పటివరకు జమైన నిధులు	814
జిల్లాలో ఖర్చుచేసిన నిధులు	402.58
ఇతర జిల్లాలకు తరలిపోయినవి	507.71

మంత్రిపై ఆశలు..

- 2018లో అన్ని కొత్త జిల్లాల్లో డీఎంఎఫ్‌టీ ఏర్పాటు చేశారు. పెద్దపల్లిస్థాయిలో మిగతా జిల్లాలకు ఆదాయ వనరులు లేకపోవడంతో ఈనిధులనే ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన వెచ్చించాలని గత రాష్ట్రప్రభుత్వం 112 జీవో తీసుకొచ్చింది. ఆ జీవో సైతం ఒక్కసారికే నిధులు తరలించడానికి జారీచేసింది. కానీ, దానిని సాకుగా చూపి సీఎంవో నుంచి నేతలు లేఖలు తీసుకొచ్చి ఇతర ప్రాంతాలకు నిధులు తరలించుకుపోయారు. 2022లో ఏ జిల్లా నిధులు ఆ జిల్లాలోనే ఖర్చు చేయాలని కొత్తగా ఉత్తర్వులు జారీచేసినా.. కొందరు నేతలు జిల్లా కమిటీకి తెలియకుండానే తరలించుకుపోయారు.

బకాయిలు విడుదల చేస్తే..

- సింగరేణి నుంచి డీఎంఎఫ్‌టీకి సుమారు రూ.500కోట్లు జమ కావాల్సి ఉంది. ప్రస్తుతం డీఎంఎఫ్‌టీ ఖాతాలో కేవలం రూ.49కోట్లు మాత్రమే ఉన్నాయి. ఇంకా రూ.253.69 కోట్లు పెండింగ్ పనులకు చెల్లించాల్సి ఉంది. దీంతో గతంలో డీఎంఎఫ్‌టీ ద్వారా అభివృద్ధి పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. సింగరేణి బకాయిలు చెల్లిస్తే.. ఇతర ప్రాంతాలకు నిధులు తరలించకుండా జిల్లాలోనే ఖర్చుచేసేలా మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలని కార్మికులు, జిల్లావాసులు కోరుకుంటున్నారు.

ఇక్కడే ఖర్చుచేయాలి



బొగ్గు తీయడం ద్వారా ఏర్పడే కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభావిత, నిర్వాసిత గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు ఖర్చు చేయాలి. సింగరేణి ఎన్నికల్లో సైతం ఇదే అంశాన్ని మా మేనిఫెస్టోలో చేర్చాం. గత ప్రభుత్వ తప్పిదాలను ఈప్రభుత్వం సరిచేయాలి. ఇక్కడి నిధులు ఇక్కడే ఖర్చు చేయాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

గత పాలకుల వైఫల్యమే..



దుమ్ము, ధూళి, ఇతర కాలుష్య కారకాల బారిన పడకుండా స్థానిక ప్రజలను రక్షించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. గత ప్రభుత్వంలోని స్థానిక నేతల అసమర్థత, పలుకుబడి ఇక్కడి నిధులను సిఫారసుల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించుకు పోయేందుకు దోహదపడ్డాయి.

– జనక్‌ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ

ప్రతీ దరఖాస్తు స్వీకరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంథని: ప్రజాపాలన సభల ద్వారా వచ్చే ప్రతీదరఖాస్తును స్వీకరించాలని, ఏ ఒక్కటీ తిరస్కరించవద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఎక్లాస్‌పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభను ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తామన్నారు. డిగ్రీ, పీజీ చదివి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులకు ఉపయోగపడేలా రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయడానికి ఒక గదిని ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. వారికి అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రి అందిస్తామని సర్పంచ్‌కు సూచించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇంటి వద్ద కూడా కాసేపు చదువుకోవాలని సూచించారు. ఎంపీపీ కొండా శంకర్, సర్పంచ్ చెన్నవేన సదానందం, ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాజ్‌ఠాకూర్



సీఎం రేవంత్‌రెడ్డితో మక్కాన్‌సింగ్ ఠాకూర్

గోదావరిఖని: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బుధవారం కలిశారు. నియోజకవర్గం అభివృద్ధిపై చాలాసేపు ముఖ్యమంత్రి, మంత్రులతో చర్చలు జరిపారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉన్నారు.

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ఉత్తదే..!



సమావేశమైన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పలువురు కార్పొరేటర్లు

- బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారు
- ఏకాభిప్రాయం వ్యక్తం చేశారన్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుపై బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతారనే వార్తలు వదంతులేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. బుధవారం డిప్యూటీ మేయర్ అభిషేక్ రావుతో కలిసి కార్పొరేటర్లతో నగరంల సమావేశమయ్యారు. అవిశ్వాస తీర్మానంపై కార్పొరేటర్ల నిర్ణయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందర్ మాట్లాడుతూ, మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడం లేదన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కార్పొరేటర్లు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు వ్యక్తం చేసిన ఏకాభిప్రాయాన్ని కేసీఆర్, కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు తెలియజేస్తామని చెప్పారు. దీంతో అవిశ్వాసానికి తెరపడినట్లేనని కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు వెల్లడిస్తున్నారు.

6న హైదరాబాద్‌కు..

కాగా, ఈనెల 6న జరిగే పార్లమెంట్ సమావేశాల కోసం నిర్వహించే సమీక్షకు హైదరాబాద్ వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నామని చందర్ తెలిపారు.

రామగుండం సీపీగా ఎల్‌ఎస్ చౌహాన్

- హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీవింగ్‌కు రెమా రాజేశ్వరి
- ఏడాదిలో తనదైన ముద్రవేసిన రెమా రాజేశ్వరి



ఎల్‌ఎస్ చౌహాన్



రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఎల్‌ఎస్ చౌహాన్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. రామగుండం సీపీగా పనిచేస్తున్న రెమా రాజేశ్వరిని ఉమెన్ సేఫ్టీవింగ్, హైదరాబాద్‌కు బదిలీ చేశారు. గతేడాది జనవరి 27న బాధ్యతలు చేపట్టిన రెమా రాజేశ్వరి.. ఏడాదిపాటు సీపీగా కొనసాగారు. ఏడాదిలో కమిషనర్‌గా ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు.

సీపీగా రెమా రాజేశ్వరి..

- అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో కీలకపాత్ర పోషించారు.
- పోలీసు ఉద్యోగుల విధినిర్వహణ, క్రమశిక్షణలో కచ్చితంగా వ్యవహరించారు.
- సరిహద్దు పోలీసు అధికారుల సమావేశం నిర్వహించి మావోస్టుల కట్టడికి కఠిన చర్యలు తీసుకున్నారు.
- కమిషనరేట్ కొత్త భవనం ప్రారంభంలో కీలకపాత్ర పోషించారు.
- ఎన్నికల సమయంలో ముగ్గురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు.
- ఎయిర్ గన్ ద్వారా బెదిరించిన ఇద్దరు నకిలీ మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు.
- పెద్దపల్లి ఐటీఐలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి ఒకేసారి 6,006 మంది దాతల నుంచి రక్తం యూనిట్లు సేకరించారు
- 72 కేసుల్లో ప్రమేయం ఉన్న దొంగను అరెస్ట్ చేసి వరుస చోరీలకు అడ్డుకట్ట వేశారు.
- వివిధ ప్రాంతాల్లో భారీవర్షాలతో వరదల్లో చిక్కుకున్న 18మంది రక్షించారు.
- అభయ యాప్‌ను సమర్థవంతంగా ప్రవేశపెట్టి 9,119ఆటోలను కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు.
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన ప్రాణహిత నది పరీవాహక ప్రాంతంలో నాలుగు డ్రోన్‌ల ద్వారా మావోయిస్టుల కదలికపై నిఘా పెట్టారు.
- ఒకే కేసులో 420కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.

గోదావరిఖని డీఎస్పీగా పనిచేసి చౌహాన్..

రామగుండం పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్న ఎల్‌ఎస్ చౌహాన్ గతంలో గోదావరిఖని డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం జోగులాంబజోన్ డీఐజీగా పనిచేస్తున్నారు. అంతకు ముందు హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా చాలా కాలం పనిచేశారు.

పది ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- డీఈవో మాధవి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పదో తరగతి వార్షిక ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో మాధవి ఉపాధ్యాయులకు సూచించారు. తారుపల్లి జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పదో తరగతి ప్రత్యేక బోధన తరగతుల తీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో పరీక్ష ప్రణాళిక, ప్రశ్నలు, జవాబులు రాయడం, చదవడం, అర్థం చేసుకోవడం, తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించాక ఆ పాఠ్యాంశాలు ఎలా మననం చేసుకోవాలని, ఎలా పట్టు సాధించాలనే తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వార్షిక పరీక్షల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, అందుకే ప్రత్యేక బోధన తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. తరచూ పేరెంట్స్ కమిటీతో సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటే మంచిఫలితాలు వస్తాయని అన్నారు. ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, హెచ్‌ఎం శ్యాం సుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీపై ఇంత నిర్లక్ష్యమా!



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: సీఎంఆర్ రైస్ డెలివరీ విషయంలో రైస్‌మిల్లర్లు జాప్యం చేస్తుండడంపై అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెలాఖరుకల్లా డెలివరీ పూర్తికావాలని, మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఎస్‌వో ప్రేంకుమార్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి జిల్లాలోని రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీపై సమీక్షించారు. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించడంలో ఎదురయ్యే ఇబ్బందులపై వారు చర్చించారు. బాకీ ఉన్న బియ్యాన్ని ఈనెలాఖరుకల్లా డెలివరీ అయ్యేలా చూడాలని అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. బియ్యం అప్పగించడంలో నిర్లక్ష్యం చేస్తే మిల్లులో ఉన్నధాన్యాన్ని ఇతర మిల్లులకు బదిలీ చేస్తామని హెచ్చరించారు. సకాలంలో డెలివరీ చేయని మిల్లర్లపై చర్యలు ఉంటాయన్నారు.

7 లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: జపాన్‌లోని వివిధ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు బుధవారం కోరారు. ఈ రంగానికి జపాన్‌లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. నెలకు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు వేతన ప్యాకేజీ ఉంటుందన్నారు. జపనీస్ భాషపై రెసిడెన్సీ శిక్షణ, పనికి తగిన అదనపు వృత్తిపర నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారని వివరించారు. దరఖాస్తుదారులు 22 నుంచి 27ఏళ్లలోపు వయసు ఉండి హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, లేదా డిగ్రీ కలిగి ఉండాలన్నారు. వివరాలకు 91007 98204, 78935 66493, 98496 39539 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

అవార్డు అందుకున్న శరణ్య



పురస్కారం అందుకుంటున్న శరణ్య

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామానికి చెందిన ప్రకృతి వైద్య నిపుణురాలు శరణ్య బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మహిళల సామాజిక సేవాలో భాగంగా శరణ్య ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రి సీతక్క ఈ పురస్కారం అందజేశారు. అనంతరం శాలువాతో ఆమెను ఘనంగా సన్మానం చేశారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెద్దపల్లి	1,25,629	1,26,519	08	2,52,156
రామగుండం	1,08,768	1,06,507	26	2,15,301
మంథని	1,17,046	1,17,058	19	2,34,123



సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. త్వరలో పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అర్హులైన వారందరి పేర్లు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించిన జిల్లా అధికారులు.. ఫిబ్రవరిలో తుది జాబితా విడుదల చేస్తారు.

ప్రజల్లో విస్తృత అవగాహన..

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనది. ఈ నేపథ్యంలో అర్హులైన వారందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టింది.

18ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలి

- 2024 జనవరి 1 నాటికి 18ఏళ్ల వయసు నిండిన వారందరూ ఓటరుగా పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు.
- ఫారం 6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు.
- అర్జీలను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా, ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువరిస్తామని ప్రకటించార
- ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాల స్వీకరణకూ అవకాశం కల్పించామని వివరిస్తున్నారు.
- పోలింగ్ కేంద్రాల వారీగా ఈ ప్రక్రియ కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.
- ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకునేందుకు వీలు కల్పించారు.
- నూతన ఓటరు దరఖాస్తుల స్వీకరణకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు.

అర్హులు దరఖాస్తు చేయాలి

2024 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్ల వయసు నిండిన వారందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం మండలాల్లో సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ గ్రామంలో బీఎల్‌వోల వద్ద పేరు నమోదు చేయాలని సూచించాం.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

క్లుప్తంగా

సీఎండీని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ సీ అండ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాంను ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో నాయకులు ధర్మపురి, వడ్డేపల్లి దాసు, బత్తుల పోశయ్య, సురేశ్ ఉన్నారు. కాగా, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ బలరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, మేనిఫెస్టో అమలు కోసం సహకరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు, భూపాల్, గౌస్, వేణుగోపాల్‌రెడ్డి, జి.సాయికృష్ణ, సాగర్ తదితరులు సీఎండీ బలరాంనాయక్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సభలను సద్వినియోగం చేసుకోండి

ఓదెల(పెద్దపల్లి): ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి సూచించారు. మడకలో బుధవారం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభను ఆయన సందర్శించారు. డీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తులు పూరించి అధికారులకు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్పెషలాఫీసర్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు

గోదావరిఖని: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరికి ఐదు రోజుల చొప్పున జడ్జి జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరిని బుధవారం సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చామన్నారు. ఈమేరకు నిందితులకు జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు.

బాధ భరించలేకున్నా.. చనిపోతున్నా..



రామకృష్ణ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కిడ్నీలో రాళ్లువచ్చి అనారోగ్యం బారిన పడిన ఓ యువకుడు ఆ బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెగడపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నూరి రామకృష్ణ(22) కిడ్నీలో రాళ్లు రావడంతో పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నాడు. అయినా, నయంకాలేదు. నొప్పి బాధ భరించలేకపోతున్నానని, చచ్చి పోవాలని ఉందని కుటుంబ సభ్యులతో తరచూ వాపోయాడు. ఈ క్రమంలోనే ఈనెల 2న తెల్లవారుజామున తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి తల్లి లలిత, తండ్రి విజయ్ ఉన్నారు.

వదిలింది ఎంత.. చెప్పింది ఎంత?

- అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఖర్చు తేల్చిన అభ్యర్థులు
- అధికారులకు నివేదికలు అప్పగించిన వైనం



పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ గెలుపుకోసం నిర్వహించిన ప్రచార ఖర్చుల లెక్కలను సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల ప్రచార ఖర్చు గరిష్ట పరిమితి రూ.48లక్షలు ఉన్నా.. అంత మొత్తాన్ని ఏ పార్టీ అభ్యర్థి కూడా ఖర్చు పెట్టలేదంటూ పేర్కొనడం గమనార్హం. మంగళవారం నాటికల్లా అప్పగించాలంటూ అధికారులు అభ్యర్థులకు తేల్చి చెప్పడంతో వారంతా తమ ప్రచార ఖర్చు వివరాలను అందించారు.

పెద్దపల్లినియోజకవర్గం

పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 17 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు చేసిన ప్రచారఖర్చు రూ.29,91,861 ఎక్కువగా ఉంది. ఎక్కువ ఖర్చుచేసిన వారిలో ఆ తర్వాతి స్థానంలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి దాసరి ఉష నిలిచారు. ఉష ఎన్నికల ప్రచారం కోసం రూ.19,25,291 వెచ్చించినట్లు అధికారులకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. వరసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలోకి దిగిన దాసరి మనోహర్‌రెడ్డి రూ.16,62,442ను ప్రచారం కోసం ఖర్చు చేసినట్లు నివేదిక అప్పగించారు. బీజేపీ అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌కుమార్ తన ఎన్నికల ప్రచారం కోసం రూ.20,74,600 ఖర్చు చేసినట్లు ఎన్నికల అధికారులకు అప్పగించిన లెక్కల్లో వివరాలను చూపారు.

రామగుండం నియోజకవర్గం

రామగుండం అసెంబ్లీ స్థానానికి 23 మంది పోటీపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఠాకూర్ మక్కాన్‌సింగ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్, బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణితోపాటు స్వతంత్ర అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ప్రధానంగా పోటీపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చందర్ రూ.36,43,032ను ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేసినట్లుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రూ.31,86,398, బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి రూ.21,33,817 ప్రచార కోసం ఖర్చు చేసినట్లు అధికారులకు ఇచ్చిన లెక్కల వివరాల్లో తేల్చారు. స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ తన ఎన్నికల ప్రచారం కోసం రూ.19,11,120 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

మంథని నియోజకవర్గం

మంథని నుంచి 21మంది పోటీ పడ్డారు. వారిలో కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.32,54,794 తన ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధుకర్ రూ.33,74,558 ప్రచారం కోసం ఖర్చు చేసినట్లు ఎన్నికల అధికారులకు లెక్కలు సమర్పించారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి చల్ల నారాయణరెడ్డి రూ.23,89,872, బీజేపీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి రూ.17,68,721 ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

స్వతంత్రులు సైతం..

అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు, పలు పార్టీల అభ్యర్థులు సైతం తమ ప్రచారం కోసం చేసిన ఖర్చు వివరాలను ఎన్నికల అధికారులకు అప్పగించారు. స్వతంత్ర అభ్యర్థుల్లో చాలాతక్కువ మంది రూ.లక్షకు మించి ప్రచార ఖర్చులు చేసినట్లు పేర్కొనగా.. చాలామంది రూ.వేలు మాత్రమే ఖర్చు చేశామని వెల్లడించారు.

వదిలిందెంత.. చెప్పిందెంత!?

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోటీపడ్డ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఓ వైపు తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్లతో భారీ బహిరంగ సభలను నిర్వహించి పెద్దసంఖ్యలో జనాన్ని తరలించేందుకు పెద్దమొత్తంలోనే ఖర్చు చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవికాకుండా రథాలతో ప్రచారాలతో ఓటరు ప్రలోభాలకోసం తాయిలాలు అందించేందుకు రూ.కోట్లలో ఖర్చు అయిఉంటాయనే అభిప్రాయాలున్నాయి. ఎన్నికల సమయంలో ప్రధాన రూట్లలో ఎన్నికల సంఘం అధికారులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తెచ్చిన పలు సామగ్రి, నగదును కూడా అక్కడక్కడా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను సైతం అధికారులకు సమర్పించుకోవడంతో ఎన్నికల పర్వం సంపూర్ణంగా ముగిసినట్లైంది.

లక్ష్య సాధనతోనే భవిష్యత్

- రూ. 20కోట్లతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ఏర్పాటు
- రూ.21.23కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
- ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: వార్షిక లక్ష్యాల సాధనతోనే సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఈఏడాది ఇప్పటివరకు 94శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. మరో మూడు నెలల్లో వందశాతం నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే కొన్నిపనులు పూర్తిచేశామని తెలిపారు. మేడిపల్లి ఓసీపీ పరిధిలోని మూడు గ్రామాల ప్రగతి పనుల కోసం రూ.2కోట్లు వెచ్చించామని, ఏరియాకు పది ఆర్వోప్లాంట్లు కేటాయించ, ఇప్పటికే మూడు ప్రారంభించామని గుర్తుచేశారు. రెండింటికి భూమిపూజ చేశామని, మరో ఐదు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ఇంటర్వ్యూ వివరాలు..

సాక్షి: వార్షిక లక్ష్య సాధనకు ఏం చేస్తారు?

జీఎం: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నాం. జీడీకే–5ఓసీపీ లక్ష్యాలకు బొగ్గు ఉత్పత్తి సాధిస్తోంది. జీడీకే–11గనిలో కొత్త ప్యానెల్స్ ప్రారంభం కావడంతో ఉత్పత్తి తగ్గింది. 32.60లక్షల టన్నులకు 30.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 94శాతం నమోదు చేశాం.

సాక్షి: కార్మికుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

జీఎం: కార్మిక కుటుంబాల సంక్షేమం విషయంలో రాజీలేదు. మిషన్ భగీరథ తరహాలో మినరల్ వాటర్ అందిస్తున్నాం. ఇందుకోసం రూ.20కోట్లతో 35ఎంఎల్‌డీ ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఈ ప్రక్రియ టెండర్ దశలో ఉంది. రూ.21.23 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణం 80శాతం పూర్తయ్యింది. మరో నాలుగు నెలల్లో అందుబాటులో వస్తుంది.

సాక్షి: కార్మికవాడల్లో ఆర్వోవాటర్ ప్లాంట్లు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

జీఎం: ఇప్పటికే మూడు ప్రారంభించాం. రెండింటికి భూమిపూజ చేశాం. మరో ఐదు టెండర్ దశలో ఉన్నాయి.

సాక్షి: కార్మిక వాడల్లో రోడ్లు అభివృద్ధి చేస్తారా?

జీఎం: ఏరియాలో 6,400కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రోడ్ల మరమ్మతు కోసం రూ.7కోట్లు వెచ్చించాం. అంతర్గత రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేస్తాం. పనులు త్వరలో ప్రారంభిస్తాం.

సాక్షి: సింగరేణి ప్రభావిత గ్రామాల పరిస్థితి ఏమిటి?

జీఎం: ప్రభావిత గ్రామాల అభివృద్ధి విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నాం. మూసివేసిన మేడిపల్లి ఓసీపీ సమీపంలోని మేడిపల్లి, లింగాపూర్, పాములపేట గ్రామాల్లో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. జీడీకే–5 ఓసీపీ ప్రభావిత జనగామ, సుందిళ్ల, ముస్త్యాలలో సోలార్ వీధిదీనాలు ఏర్పాటు చేశాం. పాఠశాల భవనాలు ఆధునికీకరించాం. మరిన్ని సోలార్ లైట్లు తెప్పిస్తాం. యువతకు వోల్వో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఉచితంగా వీటీసీ, మెడికల్‌టెస్ట్ చేయిస్తున్నాం.

సాక్షి: కార్మికుల నుంచి ఎలాంటి సహకారం ఆశిస్తున్నారు?

జీఎం: వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. రక్షణ చర్యలు పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలి. కార్మికులు పని ప్రదేశాల్లో రక్షణకు ప్రథమ స్థానం ఇవ్వాలి.

లక్ష్య సాధన దిశగా అడుగులు

- మూడో త్రైమాసికంలో పెరిగిన బొగ్గు ఉత్పత్తి
- వందశాతం నమోదు చేసిన మూడు ఏరియాలు
- గత తొమ్మిది నెలల్లో 92శాతం ఉత్పత్తి సాధన



2023–24 మూడో త్రైమాసికంలో సాధించి బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో)

ఏరియా	టార్గెట్	సాధించింది	శాతం
ఆర్జీ–1	32.44	30.38	94
ఆర్జీ–2	67.39	64.80	96
ఆర్జీ–3	39.00	38.54	99
ఏపీఏ	13.14	10.02	76
కొత్తగూడెం	103.06	101.32	98
ఇల్లెందు	24.53	29.47	120
మణుగూరు	86.35	101.41	117
బెల్లంపల్లి	21.75	28.40	131
మందమర్రి	33.70	29.40	87
శ్రీరాంపూర్	49.30	40.09	81
భూపాలపల్లి	35.36	22.74	64
నైనీ	35.50	-	-

గోదావరిఖని: వర్షాకాలం ముగిసింది. దీంతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి ఊపందుకుంది. గడిచిన మూడు త్రైమాసికాల్లో సంస్థ వ్యాప్తంగా 92శాతం బొగ్గు ఉత్పత్తి నమోదు చేసింది. ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి ఏరియాలు నిర్దేశిత లక్ష్యాలకు మించి ఉత్పత్తి సాధించగా, రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1, 2, 3 ఏరియాలు లక్ష్యాలకు సమీపంలో ఉన్నాయి. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు మరో మూడు నెలల గడువు మాత్రమే ఉంది. దీంతో ఉన్నతాధికారులు బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించారు.

రోజువారీ ఉత్పత్తిపై సమీక్ష

- సీ అండ్ ఎండీ స్థాయిలో రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.
- ఇదేసమయంలో దిశానిర్దేశం చేస్తున్నారు.
- రాబోయే వేసవిలో విద్యుత్ సరఫరాకు డిమాండ్ అమాంతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.
- అదేస్థాయిలో విద్యుత్ వినియోగదారులకు బొగ్గు అందించాలనే లక్ష్యంతో ప్రణాళిక బద్ధగా ముందుకు సాగుతున్నారు.

సింగరేణి బొగ్గుకు డిమాండ్

పలు విద్యుత్ సంస్థలకు సింగరేణి బొగ్గు తగినంత అందించాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పవర్ సెక్టార్‌లకు తగినంత బొగ్గు ఉత్పత్తి చేయాలని ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం సింగరేణి అధికారులకు దిశానిర్దేశం చే స్తోంది. ఈక్రమంలో మరో మూడు నెలలు బొగ్గు ఉత్పత్తి సంస్థకు కీలకంగా మారింది. ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని ఏరియాల వారీగా అధికారులను సంస్థ ఉన్నత స్థాయి అధికారులు సమన్వయం చేస్తున్నారు.

చోరీ కేసులో అరెస్ట్

రామగిరి(మంథని): లద్నాపూర్‌లోని మహాలక్ష్మి వైన్‌షాపులో ఈనెల 2న జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ సతీశ్ తెలిపారు. రామగిరి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లద్నాపూర్ గ్రామానికి చెందిన మహాలక్ష్మి వైన్స్‌లో చోరీ జరిగిందని ఈనెల 2న దాడి రజనీకాంత్ తమకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సమీప సీసీ కెమెరాల ద్వారా నిందితులు, వారు ఉపయోగించిన ఆటో గుర్తించారు. ఈక్రమంలో పన్నూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా అనుమానితులు వచాచరు. వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల్లో పెద్దపల్లికి చెందిన సయ్యద్ షఫీఉద్దీన్, మరొకరు మైనర్‌గా గుర్తించారు. నిందితుల వద్ద రూ.98వేల నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 24 గంటల్లో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రవిప్రసాద్, సిబ్బంది సదానందం, కిరణ్, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: గాంధీనగర్‌కు చెందిన నక్క రాజయ్య (48) అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి అయినా రాకపోవడంతో రాత్రంతా వెదికారు. చివరకు గుట్టరాజేశ్వరస్వామి ఆలయం సమీప వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితి మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



గోదావరిఖని: సైబర్ మోసాల బారిన పడకుండా ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. బుధవారం కమిషనరేట్ పరిధిలోని పలు కళాశాలలు, స్కూళ్లలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ క్రైం జరిగిన వెంటనే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ ద్వారా ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

మోసపోకుండా జాగ్రత్తలివే..

- క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని credit card limit enhancment మెసేజ్ లేదా కాల్ వస్తే నమ్మవద్దు.
- మెసేజ్‌లో ఉండే లింక్స్ క్లిక్ చెయ్యవద్దు. క్లిక్ చేస్తే సైబర్ మోసగాళ్లు ఆలింక్ ద్వారా మీ క్రెడిట్ వివరాలు సేకరించి డబ్బులు కాజేస్తారు.
- నమ్మదగిన website నుంచే షాపింగ్ చేయాలి. ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వస్తున్నాయని వస్తువులు కొనుగోలు చేయడానికి క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు తెలియజేయవద్దు.
- క్రెడిట్/డెబిట్ కార్డు స్వైప్ చేసేటపుడు పిన్ నంబర్ తెలియజేయవద్దు.
- కార్డు వివరాలు, పిన్, ఓటీపీని ఎవరికీ తెలియజేయవద్దు.




వీడని పొగమంచు



గ్రామాలు, పట్టణాలను పొగమంచు వీడడంలేదు. పడిపోతున్న ఉష్ణోగ్రలు, పొగమంచుతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉదయం పది గంటలు దాటినా మంచుతెరలు తొలగడంలేదు. ప్రధానంగా పల్లెలు మసకబారుతున్నాయి. రహదారులపై ప్రయాణికులు అవస్థలు పడుతూ గమ్యం చేరాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి పట్టణ శివారులో రహదారులు, పంట పొలాల్లో కినిపించిన పొగమంచును 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వార్డు సభల పరిశీలన



తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన వార్డు సభల తీరును అదనపు కలెక్టర్ అరుణశ్రీ బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 33, 34, 35, 36, 37, 39, 40 డివిజన్లలో నిర్వహించి సభల ద్వారా సుమారు 7,300 దరఖాస్తులు స్వీకరించారు. సభలు ప్రారంభమైన నాటి నుంచి బుధవారం వరకు సుమారు 32 వేల దరఖాస్తులు వచ్చాయి. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజాపాలన వార్డు సభలు గురువారం ఉదయం 41, 42, 43 ,44వ డివిజన్లు, మధ్యాహ్నం 45, 46, 47, 48వ డివిజన్లలో నిర్వహించనున్నారు.

జగిత్యాలలో యువకుడి వీరంగం

- ప్రయాణికుడిపై మత్తుమందు చల్లిన వైనం
- మతిస్థిమితం లేకనేనన్న పోలీసులు



మత్తుమందు చల్లిన యువకుడు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. తనవద్ద బస్‌చార్జీలు లేవని, తనను మల్యాల వద్ద దింపాలని అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిని కోరాడు. అతను నిరాకరించడంతో తన వద్ద నున్న మత్తుమందు చల్లాడు. దీంతో సదరు ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన సునీల్ కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి జగిత్యాలకు చేరుకున్న అతడు.. అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిపై మత్తుమందు చల్లాడు. అస్వస్థతకు గురైన సదరు ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సునీల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడి వద్ద చిన్నచిన్ని మారణాయుధాలు కూడా లభించాయి. బుధవారం అతని కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకుడిని ఇలా వదిలిపెట్టవద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెగడపల్లి: బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన క్యాస సంజీవ్ (40) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బైక్‌పై జగిత్యాలకు బయల్దేరిన సంజీవ్.. రో డ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పను ఢీకొని చనిపోయాడు.

నరక ప్రయాణం



సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రోడ్డు గుంతలు పడి కుంటను తలపిస్తోంది. ఇసుక తరలించే లారీలు ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగించడంతో తారురోడ్డు ఛిద్రమైంది. రాత్రి వేళనే కాదు.. పొద్దంతా ఈ మార్గంలో ప్రయాణించడం వాహనదారులకే కాదు.. ప్రజలకూ నరకం చూపుతోంది. అధికారులు చొరవ చూపి రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి